

## ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ రాజీనామా

ఎచ్చెర్ల, జూలై 6: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ప్రొఫెసర్ బాలాజీ గతేడాది నవంబరు 18న డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆయన రాజీనామా పత్రాన్ని ఆర్జీయూకేటీ ఛాన్సలర్‌కు మెయిల్ ద్వారా పంపించారు. ఇప్పటికే ఓఎస్‌డీగా పని చేసిన ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## నాడు అసాధ్యం.. నేడు సుసాధ్యం


పలాసకు వంశ'ధార'

టెక్కలిపట్నం వంశధార కాలువ వద్ద వంశధార నీటికి జలహారతులు ఇస్తున్న టీడీపీ శ్రేణులు

# ఐదేళ్ల తరువాత జలకళ

- వంశధార నీటి రాకతో రైతుల్లో ఆనందం

పలాసరూరల్, జూలై 6: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే గౌతు శిరీష నెరవేర్చారు. పలాస మండలం టెక్కలిపట్నం కాలువకు వంశధార నీటిని తీసుకువచ్చి రైతుల్లో ఆనందం నింపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చుక్క నీరు కూడా ఈ కాలువ ద్వారా అందలేదు. ఐదేళ్ల పాటు కాలువను నిర్లక్ష్యంగా వదిలేయడంతో పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాలువను బాగు చేసి సాగునీటిని అందిస్తామని ఎన్నికల్లో శిరీష హామీ ఇచ్చారు. అనుకున్నట్లే ఆమె గెలుపొందడంతో 15రోజుల కిందట వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి టెక్కలిపట్నం కాలువను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన కాలువను బాగు చేసి వంశధార నీరు వచ్చేలా చేశారు. శనివారం ఉదయం టీడీపీ నాయకులు వంశధార నీటికి పూజలు చేసి హారతులిచ్చారు. పలాస మండలంతోపాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని దేశబట్టి, జగన్నాథ చెరువులకు నీరు చేరుతుందని రైతులు తెలిపారు. అలాగే చినబాడం మీదుగా వజ్రపుకొత్తూరు మండలంలో శివారు భూములకూ సాగునీరు అందుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, వజ్జ బాబూరావు, కుత్తుమ లక్ష్మణకుమార్, జనసేన నాయకుడు దుర్గారావు, బడ్డ నాగరాజు, దువ్వాడ హేమబాబుచౌదరి, దువ్వాడ సంతోష్, వడ్డి యాదగిరి, చంద్రశేఖర్‌త్యాడి, అవుగాన షణ్ముఖరావు, వజ్రపుకొత్తూరు, మందస నాయకులు పాల్గొన్నారు.

- పలాస నియోజకవర్గంలో ఐదేళ్ల తర్వాత వంశధార జలకళ ఉట్టిపడింది. 2019 నుంచీ వైసీపీ పాలనలో వంశధార నుంచి పలాసకు ఒక్క చుక్క నీరు కూడా అందించలేకపోయారు. కనీస నిర్వహణ లేక కాలువలు అధ్వానంగా మారాయి. సాగునీరందించడం కష్టమేనని అప్పట్లో వైసీపీ నాయకులు పేర్కొన్నారు. కాగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఖరీఫ్ నాటికి సాగునీరందించేలా టీడీపీ నాయకులు చర్యలు చేపట్టారు. శనివారం పలాస మండలం టెక్కలిపట్నం వద్ద కాలువలో వంశధార నీరు చేరడంతో రైతులు జలహారతి పట్టారు.

- పాత్రునివలసలో టిడ్కో కాలనీకి బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. 2017లో టీడీపీ ప్రభుత్వం టిడ్కో కాలనీ నిర్మించింది. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పట్టాల పంపిణీ నిలిచిపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ నిర్లక్ష్యం వహించింది. గతేడాది హడావుడిగా ఇళ్ల పట్టాలు అందజేసినా.. కనీస సౌకర్యాలు కల్పించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టీడీపీ నేతలు బస్సు సేవలందించేలా చర్యలు చేపట్టారు. శనివారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్.. టిడ్కో కాలనీకి ఆర్టీసీ బస్సును ప్రారంభించారు.


'టిడ్కో'కు బస్సు

బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

# పాత్రునివలసకు ఆర్టీసీ సేవలు ప్రారంభం

- రేషన్ కష్టాలూ తీరుస్తామన్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, జూలై 6: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాత్రునివలస వద్ద ఉన్న టిడ్కో కాలనీలో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో కాలనీకి బస్సు సర్వీసును ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. 2017లో టీడీపీ ప్రభుత్వం పాత్రునివలస వద్ద టిడ్కో ఇళ్లను నిర్మించింది. లబ్ధిదారులకు పట్టాల అందించే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ ప్రభుత్వం వీటిపై తీవ్ర నిర్లక్ష్యం వహించింది. 2023లో సౌకర్యాలు కల్పించకుండానే లబ్ధిదారులకు గృహాలను అందించింది. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా శ్రీకాకుళం నగరానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన గొండు శంకర్ తనను గెలిపిస్తే రెండు నెలల్లోనే రవాణా సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారు. ఆయన గెలిచాక మాట నిలబెట్టుకున్నారు. శనివారం టిడ్కో కాలనీ నుంచి పాతబస్టాండ్ వరకు పల్లె వెలుగు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. రోజు ఉదయం 8.30గంటలకు టిడ్కో కాలనీ నుంచి, తిరిగి సాయంత్రం 6.30గంటలకు శ్రీకాకుళం పాత బస్టాండు నుంచి ఈ సర్వీస్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. జనాదరణ మేరకు మరిన్ని బస్సులను నడుపుతామని చెప్పారు. అలాగే రేషన్ కష్టాలు తొలగించేందుకు టిడ్కో కాలనీ లోనే డిపోను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

# రేపటి నుంచి.. 'ఇసుక ఉచితం'

- నూతన విధానంపై ప్రభుత్వ ఆదేశాలు
- అక్రమాలపై ఫిర్యాదు చేయండి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచే అమల్లోకి రానుంది. ఈమేరకు శనివారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇసుక నూతన విధానాలపై ఆదేశాలు జారీచేశారు. అనంతరం భూగర్భ గనుల శాఖతోపాటు ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలందరికీ 'ఉచిత ఇసుక' విధానం అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఇకపై మెట్రిక్ టన్ను ఇసుకకు కేవలం రూ.340కే అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇసుక డిపోలు, రీచ్‌ల వద్ద ఇసుక తరలింపు.. తవ్వకాలలో అక్రమాలు జరగకుండా రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పర్యవేక్షించనున్నట్టు వెల్లడించారు. 'ఇళ్ల నిర్మాణాలకే ప్రాధాన్యమిస్తాం. ప్రస్తుతమున్న డిపోలు, రీచ్‌లను స్వాధీనం చేసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. రెవెన్యూ, మైన్స్, పోలీసుశాఖ అధికారులంతా నిఘా పెట్టాల్సిందే. అక్రమాలకు ఆస్కారం లేకుం డా ఇసుక పంపిణీని కొనసాగిస్తాం. ఇప్పటికే టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, పలాస, శ్రీకాకుళం ఆర్డీవోలు భరత్‌నాయక్, రంగయ్య, సెబ్ ఏఎస్పీ గంగాధరం, మైన్ డీడీ సత్యనారాయణ, డీపీవో వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బెన్హర్‌కు స్పష్టమైన సూచనలు, ఆదేశాలు జారీచేశాం. అక్రమాలపై ప్రజలు కూడా టోల్‌ఫ్రీ నంబర్ 1800- 425-6012, ల్యాండ్‌లైన్ 08942-293229 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాట్సాప్ 97016 91657 నెంబర్‌లో సంప్రదించవచ్చు. అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకుంటా'మని కలెక్టర్ తెలిపారు.

# కలుషిత ఆహారం తిని..

- 20 మంది కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత

టెక్కలి, జూలై 6: కోటబొమ్మాళిలోని కేజీబీవీ విద్యార్థినులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. ఈ కేజీబీవీలో 280మంది విద్యార్థినులు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసి.. నీరు తాగిన కాసేపటి తర్వాత 20మంది కడుపునొప్పితో బాధపడ్డారు. వాంతులు, విరోచనాలు కావడంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి స్పందించి అనారోగ్యానికి గురైన సోనియా, శరణ్య, త్రిష, మేఘన, జ్యోషిత, జగది, ఉమ, బాషిత, ప్రియ తదితర విద్యార్థినులను కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. వైద్యం చేయడంతో వారంతా కోలుకుంటున్నారు. జీసీడీవో ఎన్.నీరజ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థినులను పరామర్శించారు. ఇదే పాఠశాలలో తిలారు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మనీష రెండు రోజులుగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. కలుషిత ఆహారం, నీరు కారణంగానే అస్వస్థతకు గురయ్యారని పీహెచ్‌సీ వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతానికి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. సమాచారం తెలుసుకుని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందజేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ ఘటనపై అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు


# అప్పట్లో సధరమే!

- పింఛన్ మంజూరు కోసం.. నకి'లీలలు'

- అడ్డగోలుగా వ్యవహరించిన వైసీపీ నేతలు
- తప్పుడు ధ్రువపత్రాలతో దివ్యాంగులుగా..
- స్పీకర్ మనిషినంటూ ఓ దళారి రంగప్రవేశం
- డబ్బులకు ఆశపడిన కొంతమంది వైద్యులు
- ప్రభుత్వం మారడంతో వెలుగులోకి అక్రమాలు

**పింఛన్ల మంజూరులో కొందరు వైసీపీ నేతలు అడ్డగోలుగా వ్యవహరించారు. అర్హులు కాకున్నా డబ్బులు తీసుకుని సదరం సర్టిఫికెట్లు ఇప్పించారు. కొంతమంది వైద్యులు కూడా డబ్బులకు ఆశపడి అర్హులైనట్లు పత్రాలు ఇచ్చేశారు. ఈ వ్యవహారంలో ఒక్కో దరఖాస్తుకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వెలుగులోకి రావడంతో వైసీపీ నాయకులు అక్రమాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి.**

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)






దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్ అందజేస్తోంది. కాగా.. కొంతమంది అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా.. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి.. దివ్యాంగ పింఛన్ పొందడం చర్చనీయాంశమవుతోంది. గత వైసీపీ పాలనలో అప్పటి ప్రజాప్రతినిధుల సిఫారసులతో చాలామంది సదరంలో నకిలీ ధ్రువపత్రాలు పొందారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండున్నరేళ్ల కిందట వైసీపీ కీలక ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుని ఓ వ్యక్తి- 'సదరం'లో పెత్తనం చెలాయించాడు. వైద్యులతో దర్జాగా నకిలీ ధ్రువపత్రాలు మంజూరు చేయించుకుని పింఛన్ పొందుతున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో.. ఇటువంటి నకిలీలలు అన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

### అప్పట్లో.. స్పీకర్ మనిషినంటూ..

వైసీపీ పాలనలో జిల్లాలో ఆ పార్టీ ఎమ్మెల్యేలకు కొంతమంది ప్రాధాన్యపరమైన పదవులు లభించాయి. ఇదే అదునుగా అక్రమార్జనకు పాల్పడ్డారు. ప్రధానంగా దివ్యాంగుల పింఛన్ మంజూరులో సిఫారసు చేస్తూ.. అక్రమ వసూళ్లు చేశారు. నకిలీలకు పెద్ద ఎత్తున ధ్రువపత్రాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, మత్స్యకారులు.. ఇలా వీళ్లందరికంటే దివ్యాంగులకు రెట్టింపు పింఛన్ లభిస్తుంది. అయితే సకలాంగులకు కూడా దివ్యాంగులుగా సర్టిఫికెట్‌లు అధికారికంగా తయారీ చేయించగలనని.. ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన ఓ వ్యక్తి మూడున్నరేళ్ల క్రితం రంగంలోకి దిగాడు. ఈయన అప్పటి స్పీకర్ అనుచరుడినంటూ తనకుతానే పరిచయం చేసుకుంటూ నేరుగా శ్రీకాకుళంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సదరన్ విభాగంలో పెత్తనం చెలాయించాడు. డాక్టర్‌లకు లంచాలిస్తూ... అటు టెక్కలి, పాలకొండ, నరసన్నపేట వంటి ఆసుపత్రిల్లోనూ వైద్యులతో పనులు చేయించుకున్నాడు. వారం వారం.. సదరంలో దివ్యాంగ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన దరఖాస్తులను తీసుకొచ్చి డాక్టర్లతో నచ్చినంత పర్సంటేజీ (వికలాంగ ధ్రువీకరణ శాతం) నమోదు చేసేలా చక్రం తిప్పేవాడు. అర్హత లేకున్నా.. చెవులు వినిపించడం లేదని.. కాళ్లు బలహీనంగా ఉన్నాయని.. కళ్లు కనిపించడంలేదని.. ఇలా ధ్రువీకరణ పత్రాలపై 'యాభై' శాతం నమోదు చేయించేలా వైద్యులను ఒప్పించేవాడు. ఇవన్నీ చేసేందుకు దరఖాస్తుదారుడి నుంచి రూ.30వేల నుంచి రూ.50వేల వరకు తీసుకుని.. అందులో వైద్యులకు కొంత ఇచ్చేవాడు. దీంతో ఆటంకం లేకుండా పని జరిగిపోయింది. దివ్యాంగులు సాధారణ వ్యక్తులైతే.. రకరకాల కొర్రీలువేసి వారిని మరో వారం రావాలంటూ తిప్పే వైద్యబృందం.. ఈ వ్యక్తి తెచ్చి ఇచ్చిన 'ధర'ఖాస్తులను ఆమోదించేవారు. ఆ ధ్రువపత్రాలతో చాలామంది అక్రమంగా పింఛన్ లబ్ధి పొందుతున్నారు.

### మూడు నియోజకవర్గాల్లో అధికం..

ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల్లో అధికంగా నకిలీ దివ్యాంగులు తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్ పొందుతున్నారు. ఇటువంటి వాటిపై ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. పొందూరు మండలంలో ఏడాది కిందట దివ్యాంగుల పింఛన్ల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. అప్పట్లోనే ఆరోపణలు, జిల్లా కలెక్టర్ స్పందనకు ఫిర్యాదులు అందినా చర్యలు లేవు. ఇప్పుడు సాక్ష్యాధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు కార్యాచరణ సిద్ధమైంది. ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం, నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల్లో అనర్హులు అధికంగా దివ్యాంగుల పింఛన్ పొందుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. నకిలీలు కోకొల్లలు ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. నకిలీ దివ్యాంగుల పింఛన్‌దారుల విషయంపై శ్రీకాకుళంలోని బీజేపీ నాయకుడొకరు తీగలాగారు. ఇప్పుడు పాతడొంకంతా కదులుతోంది. ప్రస్తుతానికి ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల్లో నకిలీ దివ్యాంగుల పెన్షన్ల గుట్టురట్టయింది. అతిత్వరలో పింఛన్లపై ఆడిట్ జరిగే అవకాశముంది. దివ్యాంగుల పింఛన్‌దారుల ధ్రువపత్రాలు మరోసారి పరిశీలించనున్నారు. దీంతో నకిలీ దివ్యాంగ పింఛన్‌దారుల్లో అలజడి రేగుతోంది. ఇక వృద్ధాప్య పింఛన్ కోసం.. ఆధార్ కార్డుల్లో వయసు మార్పిడి చేసుకున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉంది. వీటిపైనా ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేరింది. అతిత్వరలో అక్రమ పింఛన్‌దారుల లెక్క తేలనుంది. రాజకీయాలకు అతీతంగా నకిలీల ఆట కట్టించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# కేఆర్ స్టేడియం పూర్తయ్యేనా?

- పనులపై గత సర్కారు నిర్లక్ష్యం
- ఐదేళ్లలో కదలని నిర్మాణం
- కూటమి ప్రభుత్వంపైనే క్రీడాకారుల ఆశలు

(శ్రీకాకుళం స్పోర్ట్స్)

జిల్లాకే తలమానికమైన శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణంపై గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఏడాదిలో పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చి మాట తప్పింది. ఐదేళ్లలో ఒక్క ఇంచుకూడా నిర్మాణం ముందుకు సాగలేదు. దీంతో ఆడుకునేందుకు మైదానం లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా స్టేడియం పనులను పూర్తి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీకాకుళం నగర నడిబొడ్డున జిల్లాకు చెందిన మల్లయోధుడు కోడిరామ్మూర్తి పేరిట స్టేడియాన్ని నిర్మించారు. ఈ స్టేడియంలో ఎందరో క్రీడాకారులు శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఈ స్టేడియం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏడేళ్ల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. 2016లో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు చొరవతో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.9కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. రూ.7.53 కోట్ల విలువైన పనులను కాంట్రాక్టరు పూర్తి చేశారు. ఈ మేరకు రూ.4.73 కోట్ల బిల్లులు కూడా అందజేశారు. ఇంకా రూ.2.80 కోట్లు కాంట్రాక్టర్‌కు రావల్సి ఉంది. స్టేడియం పూర్తవుతుందన్న తరుణంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడాదిలో ఈ పనులు పూర్తిచేస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ఐదేళ్లయినా పూర్తి చేయలేకపోయింది. రెండేళ్ల కిందట జిల్లాలో జరిగిన సభలో అప్పటి సీఎం జగన్ పాల్గొని స్టేడియం నిర్మాణానికి మరో రూ.12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మంత్రులు, సీనియర్ నాయకులు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం సైతం చేశారు. కానీ, పనులు మాత్రం ముందుకు కదల్లేదు. మళ్లీ ఎన్నికల సమయంలో క్రీడాకారుల నుంచి సానుభూతిని పొందేందుకు పనులు చేయిస్తున్నట్లు హడావుడి చేశారు. స్టేడియం లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో తర్ఫీదు పొందుతున్నామని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.


అర్ధాంతరంగా నిలిచిన స్టేడియం సముదాయం

# అందర్నీ కడుపుబ్బా నవ్వించే డార్లింగ్



నిర్మాతలుగా 'హను-మాన్' చిత్రంతో సూపర్‌హిట్ అందుకున్నారు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య. లేటెస్ట్‌గా ప్రియదర్శి, నభానటేశ్ జంటగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'డార్లింగ్' చిత్రాన్ని నిర్మించారు. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉప శీర్షిక. అశ్వనీ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చైతన్య మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

'కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా. యూత్, ఫ్యామిలీ ఇలా..ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా సినిమాను దర్శకుడు తీర్చిదిద్దారు. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. ఈ పాత్రలకి ప్రియదర్శి, నభానటేశ్ సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. సినిమాలో ఇద్దరి క్యారెక్టర్లకీ సమ ప్రాధాన్యత ఉంటుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. వివేక్ సాగర్ సంగీతం సినిమాకు స్పెషల్ హైలైట్. 'హను-మాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది. ఈ సినిమాలో హనుమంతుడి పాత్రలో ఎవరు నటిస్తారనేది మాత్రం సస్పెన్స్" అని చెప్పారు.

# అనాథలే స్టార్స్

సంజయ్ శ్రీరాజ్‌ను హీరోగా, ప్రియా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు ధర్మ మాట్లాడుతూ 'నెల్లూరులో చిత్రాన్ని నిర్మించాం. ఓ గల్లీలో నివసించే అనాథలు ఎదుర్కొనే సమస్యలను



చిత్రంలో వివరించాం' అని చెప్పారు. చిత్ర నిర్మాత డాక్టర్ అరవేటి యశోవర్ధన్ మాట్లాడుతూ 'క్రైమ్ డ్రామా చుట్టూ చిత్రకథ నడుస్తుంది. ఇందులో నాలుగు పాత్రలు ప్రముఖంగా ఉంటాయి. అనాథలైన వారి జీవితాలు ఎలా ఎవరి వల్ల మలుపు తిరిగిందో చూపించాం. మాస్ ఆడియన్స్‌కు నచ్చేసినిమా ఇది' అని చెప్పారు.

# దర్శకధీరుడిపై డాక్యుమెంటరీ



దర్శకధీరుడు రాజమౌళిపై ఓ డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ ఖన్నా దర్శకత్వంలో 'ద మోడరన్ మాస్టర్స్' పేరుతో ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తోంది. ఆగస్టు 2న ఇది విడుదల కానుంది. దర్శకుడిగా రాజమౌళి ప్రయాణాన్ని.. ఆయన ఇండియన్ సినిమాపై చూపిన ప్రభావాన్ని ఇందులో చూపించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో రాజమౌళి గురించి ఆయన బంధుమిత్రులు, దర్శకులు జేమ్స్ కామెరూన్, రుస్సో బ్రదర్స్, హీరోలు రానా, ప్రభాస్ తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు.

# బడ్డీ హార్ట్ టచింగ్ సాంగ్



అల్లు శిరీష్ నటించిన తాజా చిత్రం 'బడ్డీ' ఈ నెల 26న విడుదల కానుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని జ్ఞానవేల్ రాజా, అధన నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'చూసాలే నాలో నీ కలనే.. దాచాలే దాచాలే నాలో ఆ కలనే' అంటూ సాగే ఈ హార్ట్ టచింగ్ సాంగ్‌ను సాయి హేమంత్ రాశారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచి ఐరా ఉడిపితో కలసి పాడారు. గాయత్రి భరద్వాజ్, అజ్మల్, అమీర్, ప్రిషా రాజేశ్ సింగ్, ముఖేశ్‌కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నేహా జ్ఞానవేల్ రాజా సహ నిర్మాత.

# ఆధారాలు సమర్పించండి..



**హీరో రాజ్‌తరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళకు నోటీసులు**

సినీ హీరో రాజ్‌తరుణ్ తనను మోసగించాడంటూ ఫిర్యాదు చేసిన లావణ్య అనే మహిళకు నార్సింగ్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలను విచారణ నిమిత్తం తమకు సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. లావణ్య ఆధారాలు సమర్పిస్తేనే ఈ కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుంది. లేదంటే కోర్టు అనుమతితో పోలీసులు కేసును చట్ట ప్రకారం మూసివేస్తారు.

# శేఖర్ కమ్ముల చేతుల మీదుగా...



సాయితేజ కల్వకోట, పావని కరణమ్ జంటగా నటిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ హాస్యభరిత వ్యంగ్య చిత్రాన్ని యాడ్ ఫిల్మ్‌మేకర్ ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొడుల నిర్మించారు.శుక్రవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'సోడు సోడు' పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ పాటకు మంచి సాహిత్యంతో పాటు ఆకట్టుకునే సంగీతం తోడైంది' అని చెప్పారు. 'పూర్తి స్థాయి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రమిది" అని నిర్మాత రామకృష్ణ బొడుల తెలిపారు. ఈ పాటకు ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి సాహిత్యం అందించగా, యశ్వంత్ నాగ్‌నారు సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ కుర్మన, డీఓపీ: సందీప్ బొద్దుల.

# దిక్సూచి

# ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ జాగ్రత్తలు

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించినకౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. టీజీఈఏపీ సెట్/ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ఇబ్బంది ఏమీ లేదు. కోరుకున్న కాలేజీలో, అనుకున్న బ్రాంచీలో సులువుగా సీటు పొందవచ్చు. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన అభ్యర్థులకే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఎలా చేస్తే, మంచి కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీటు వస్తుందన్నది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎదురయ్యే ప్రశ్న. ఈ విషయంలో నిపుణుల మాటేమిటో చూద్దాం.

ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలైనప్పుడు ఇరవై నుంచి ముప్ఫయ్ ఆప్షన్లు పెట్టుకుంటే చాలు అని ఎక్కువమంది విద్యార్థులు అనుకుంటారు. అయితే అది తప్పని కౌన్సెలింగ్ నిర్వాహకులు పదేపదే చెబుతున్నారు. నిజానికి వందల కొద్ది ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. అలాంటప్పుడు కేవలం కొన్ని ఆప్షన్లు మాత్రమే పెట్టుకుంటే, నష్టం జరిగే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ర్యాంకు వచ్చినప్పుడు విద్యార్థులు కనీసం రెండు, మూడు వందలు, వీలైతే అంతకన్నా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పకుండా వస్తాయన్న వాటికితోడు, అటూ ఇటూగా రావడానికి అవకాశం బాగా ఉన్న కాలేజీలు, బ్రాంచీలను కూడా ఎంచుకోవాలి. ప్రత్యేకించి మనకు



రాదనుకున్న బ్రాంచ్ లేదా కాలేజీకి ఎవరూ ఆప్షన్ పెట్టుకోని పక్షంలో పరిస్థితి అనుకూలిస్తే మనకే దక్కవచ్చు.

**అవకాశం ఒక్కసారే:** ర్యాంక్ పెద్ద సంఖ్యలో వచ్చినప్పటికీ మంచి కాలేజీలు, కోర్సుల విషయంలో రాజీ పడాల్సిన పని లేదు. మనకు నచ్చిన కాలేజీ లేదంటే కోర్సు నుంచి ఆప్షన్లు ఆరంభించవచ్చు. ర్యాంకుల ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుంది. అంటే మొదటి ర్యాంక్ తరవాత రెండో ర్యాంక్ క్యాండిడేట్ ఇచ్చుకున్న ఆప్షన్ల ఆధారంగా అలాట్‌మెంట్ ఉంటుంది. ఉదాహరణకు వందో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ప్రత్యేకించి నచ్చిన కాలేజీలను తనిష్టం వచ్చిన రీతిలో పెట్టుకున్నాడని అనుకుందాం. ఆ అభ్యర్థికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం సీటు కేటాయింపు జరుగుతుంది. అంటే ఆ వ్యక్తిని వందో అభ్యర్థిగా పరిగణిస్తుంది. తనకు ముందున్న 99 మందికి సీట్ల కేటాయింపు పూర్తయ్యాక ఇతని వంతు వస్తుంది. అప్పుడు సీటు కేటాయింపు ఆ వ్యక్తి పెట్టుకున్న మొదటి ఆప్షన్ నుంచి ఆరంభమవుతుంది. ఆప్షన్ నెంబర్ 1, 2, 3.. అలా మొదలవుతుంది. ఆప్షన్ 30 దగ్గర క్లిక్ కావచ్చు. లేదంటే 200 వద్ద క్లిక్ కావచ్చు. ఆ ఆప్షన్‌గా పెట్టుకున్న కాలేజీ, కోర్సులో సీటు లభిస్తుంది. వందో వ్యక్తిగా మాత్రమే ఆ అభ్యర్థికి కేటాయింపు ఆరంభమవుతుంది. ముఖ్యంగా ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో గరిష్ఠంగా ఆప్షన్లకు అవకాశం ఇవ్వడం అందుకోసమేనని గుర్తించాలి. అసలు ఒక్కరూ ఆప్షన్ పెట్టుకోనందున కొన్ని సీట్లు మిగిలిపోయాయని చెబుతూ ఉంటారు. అలాగే ఒక్కరు కూడా చేరని కాలేజీలు లేదా బ్రాంచీల వివరాలను కౌన్సెలింగ్ నిర్వాహకులు అధికారికంగానే ప్రకటిస్తుంటారు. ఆ కాలేజీలు లేదా ఆ గ్రూపులు కొన్ని అంత డిమాండ్ లేనివి కావచ్చు. అలాగే డిమాండ్ ఉన్నప్పటికి రాదని కొందరు ఆప్షన్లుగా ఇచ్చుకుని ఉండకపోవచ్చు. కారణం ఏమైనా ఆ సీట్లు మొదటి రౌండ్‌లో మిగిలిపోయాయన్నది వాస్తవం.

**మొదటి అవకాశమే మంచిది:** ఇలాంటి వెబ్ కౌన్సెలింగ్‌లో తొలి ఎంపికే కీలకం. రెండోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, అప్పుడు ఛాన్స్‌లు తక్కువ. కేవలం మిగిలిన సీట్లకు మాత్రమే పోటీపడాల్సి వస్తుంది. అందువల్ల మొదటి కౌన్సెలింగ్ సమయంలోనే కొద్దిగా తెలివిగా వ్యవహరించాలి.

**లాస్ట్ ఇయర్ కటాఫ్ చూడాలి:** కాలేజీలు, సీట్లవారీగా గత ఏడాది కేటాయింపు సమాచారం చూస్తే మంచిది. అయితే ఇది కేవలం గైడింగ్ ఫ్యాక్టర్ మాత్రమే. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కేటాయింపు జరగాలని లేదు. ప్రత్యేకించి ప్రసిద్ధ కాలేజీల్లో మాత్రం ర్యాంకింగ్‌లో కొద్దిగా అటూ ఇటూగా మాత్రమే మారుతుంది.



**ప్రొఫెసర్ ఎస్.వి.రమణారావు**
రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్

**ఆంధ్రప్రదేశ్**
**ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్**

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 7 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 10 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 12
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 13
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 16
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 17 - 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 19 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/

**తెలంగాణ**
**ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్**

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 - 23
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

# జయశంకర్ వర్సిటీలో పాలిసెట్ ప్రవేశాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణ పాలిసెట్ 2024 (అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి ప్రోగ్రామ్‌లో 60 శాతం సీట్లు కేటాయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

**కౌన్సెలింగ్ షెడ్యూల్:** తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్)లో 447 నుంచి 19998 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 10న, 20015 నుంచి 46924 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 11న, 47062 నుంచి 68151 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 12న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమౌతుంది.

- **కౌన్సెలింగ్ వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన ఫస్ట్ సెమిస్టర్ ఫీజు:** యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రూ.19,460; ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో రూ.22,210.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

**'దిక్సూచి' వెబ్ పేజీలో..**
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/r1mnRyKతో చదవండి.

# నేడు తొలి రథయాత్ర

- ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు
- వేడుకగా స్వామివారి నేత్రోత్సవం
- పది రోజులపాటు వివిధ రూపాల్లో దర్శనం

(శ్రీకాకుళం కల్చరల్/ ఇచ్ఛాపురం/ సోంపేట/ కంచిలి/ టెక్కలి/ నరసన్నపేట/ పాతపట్నం/ హిరమండలం)

జగన్నాథస్వామి రథయాత్ర ఆదివారం కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం, గుజరాతీపేట, మొండేటి వీధి, పాండురంగ వీధి, సోంపేట, మఠం కంచిలి, టెక్కలి పెద్ద బ్రాహ్మణ వీధి, నరసన్నపేట పెద్దవీధి, వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి, పాతపట్నం, హిరమండలంలోని స్వామి వారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. గత పదిహేను రోజులుగా అస్వస్థతకు గురై విశ్రాంతిలో ఉన్న స్వామి కోలుకుని ఉత్సవాలకు సిద్ధమవుతారు. ఈ నేపథ్యంలో శనివారం నేత్రోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గుడించా మందిరం నుంచి సుభద్ర, బలబద్ర సమేతంగా స్వామి వారి రథయాత్ర నిర్వహించనున్నారు. ఆదివారం నుంచి పది రోజుల పాటు వివిధ రూపాల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

### ఇచ్ఛాపురంలో రెండూ ఒకేరోజు

ఇచ్ఛాపురం జగన్నాథ స్వామి రథయాత్రతోపాటు నేత్రోత్సవం రెండూ ఆదివారం నాడే నిర్వహించనున్నారు. అర్థ శతాబ్దం తర్వాత ఇలా రెండు ఒకేరోజు ఈ ఆలయంలో జరగడం విశేషం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఆలయ మేనేజర్ బిండి రామారావు చేపట్టారు. జ్యేష్ఠ పౌర్ణమి ముందురోజునే స్వామి వారి దైవత్వాన్ని మంత్రపూర్వకంగా ఒక పూర్ణ కుంభంలోకి గ్రహిస్తారు. గర్భగుడిలో నిత్య పూజాదికాలు, నివేదనలు జరుగుతుంటాయి. పూర్ణకుంభంలోని దైవత్వాన్ని తిరిగి విగ్రహ రూపాల్లోకి మంత్రపూర్వకంగానే తీసుకువస్తారు. ఈ ఘట్టం ఆదివారం ఉదయం పూర్తవుతుంది. ఆ తర్వాత భక్తులకు వివిధ రూపాల్లో స్వామివారు దర్శనమిస్తారు.


ఇచ్ఛాపురంలోని జగన్నాథస్వామి ఆలయం


హిరమండలంలో విద్యుత్ అలంకరణలతో జగన్నాథ ఆలయం

### సైకత జగన్నాథుడు




ఆమదాలవలస: మండలంలోని సంగమేశ్వర కొండ వద్ద శనివారం రూపొందించిన జగన్నాథ స్వామి సైకత శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రథయాత్ర సందర్భంగా జగన్నాథ స్వామితో పాటు బలభద్ర, సుభద్ర సైకత శిల్పాలను తీర్చిదిద్దినట్లు గాజుల కొల్లివలస గ్రామానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ తెలిపారు.

### నేత్రోత్సవ దృశ్యాలు


శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలో నేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


పలాస రూరల్: తర్లాకోటలో...


మందస: నేత్రోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి మాధురి

పలాస: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని పలాస మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి యు. మాధురి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణం ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజు, ఏఎస్ఐ ప్రకాష్, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యానికి చేరుకోండి


మాట్లాడుతున్న న్యాయాధికారి తేజా చక్రవర్తి

టెక్కలి: ద్విచక్రవాహనం నడిపేటప్పుడు వాహనచోదకుడు, వెనుక కూర్చున్న వ్యక్తి హెల్మెట్‌ను ధరించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజాచక్రవర్తి అన్నారు. శనివారం ద్విచక్ర వాహనదారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకపోతే జరిగే పరిణామాలను వివరించారు. మోటార్ వాహనాల చట్టం రూపొందించిన నియమాలు, శిక్షలను తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం.రూపావతి, వెంకటరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంవీ యాక్ట్‌లపై అవగాహన అవసరం


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సివిల్ న్యాయాధికారి హరిప్రియ

నరసన్నపేట: మోటార్ వెహికల్ చట్టాలపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ అన్నారు. శనివారం ఎంవీ యాక్ట్, నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా మృతి చెందుతున్నారని, దీనికి అతివేగం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడమే నన్నారు. దీనిపై అవగాహన కలిగించాలన్నారు. అతివేగంగా వెళ్లినా, మైనర్లు వాహనాలు నడిపినా సీజ్ చేయాలన్నారు. హెల్మెట్ ధరించకపోయినా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు.

## చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి పరేష్ కుమార్

ఇచ్ఛాపురం: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఇచ్ఛాపురం మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరేష్‌కుమార్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ, ఉమెన్ పోలీస్, సచివాలయ, ఐసీడీఎస్, అంగన్‌వాడీ, ఉద్యోగులతో నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల ఒకటి నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి పరేష్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, డీటీ శ్రీహరి, ఐసీడీసీ పీవో నాగరత్నం, న్యాయవాదులు రమణయ్య రెడ్డి, దేవరాజ్‌రెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, ఎస్ఎల్ నారాయణ, రాంబాబు, మనోజ్, రంగారావు, బైరాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, భగవాన్‌దాస్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతు బాంధవుడు అచ్చెన్న


చిత్రపటాల వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, టీడీపీ నేతలు

టెక్కలి: రైతులకు ఏ కష్టం వచ్చినా తానున్నానని, సకాలంలో స్పందించే వ్యక్తి, రైతు బాంధవుడు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అని టెక్కలి, నందిగాం మండలాల టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్‌కుమార్ అన్నారు. శనివారం మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌ల చిత్రపటాలకు రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రూ.31 లక్షలు మంజూరు చేసి సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. దీనివల్ల టెక్కలి, నందిగాం మండలాల్లో 20 గ్రామాల్లోని 3,500 ఎకరాలకు సాగునీరందుతుందని, అచ్చెన్న రుణం తీర్చుకోలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలాకి షణ్ముఖరావు, గుజ్జారు సత్యనారాయణ, దారపు పాపారావు, దారపు రాము, సింగుపురం షణ్ముఖరావు, కామరాజు, శరత్ తదితరులు ఉన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా నాణ్యతతో ఉండాలని ఎంఈవోలు పేడాడ దాలినాయుడు, ఉప్పాడ శాంతారావు సూచించారు. శనివారం సత్యవరం, దేవాది పాఠశాలలను పరిశీలించారు. సత్యవరం పాఠశాలలో ఎండీఎం పనితీరుపై వచ్చిన ఫిర్యాదులు మేరకు పరిశీలించారు. పాఠశాల ఆవరణలోనే వంటలు చేయాలని హెచ్ఎంలు ఎండీఎం నిర్వాహకులకు సూచించారు. హోంవర్కు పుస్తకాలను సరిదిద్దాలన్నారు. పాఠశాలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు.

### తొగిరి 'ఎత్తిపోతల'కు రూ.8.35 లక్షలు మంజూరు

జలుమూరు(సారవకోట): తొగిరి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.8.35 లక్షలు మంజూరైనట్లు టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ పథకం పాడై మూలన పడిందన్నారు. దీంతో సాగునీరందక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కృషితో నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో మరమ్మత్తులు చేయించి సాగు నీరందిస్తామన్నారు.



## మేకపోతులు దొంగలిస్తూ పట్టుబడిన యువకుడు

- మరో ఇద్దరు పరారీ
- పోలీసులకు నిందితుడి అప్పగింత

పలాసరూరల్: లొద్దభద్ర గ్రామంలో మేకపోతులను దొంగిలించిన యువకులు శనివారం గొర్రెల కాపరులకు పట్టుబడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. లొద్దభద్ర గ్రామానికి చెందిన గొర్రెల కాపరి జినగ కేశవరావుకు చెందిన ఐదు మేకపోతుల కాళ్లను కట్టి ముగ్గురు యువకులు తరలిస్తుండగా గొర్రెల కాపర్లు గమనించి వారిని అడ్డుకున్నారు. ఈ మేకపోతులు ఎక్కడివని వారిని ప్రశ్నించగా తాము కొనుగోలు చేశామని ఆ యువకులు వాదనకు దిగి ద్విచక్ర వాహనంపై పరారీకి ప్రయత్నించారు. వీరిలో ఒక యువకుడు గొర్రెల కాపర్లకు పట్టుబడగా, మిగిలిన ఇద్దరు తప్పించుకున్నారు. పట్టుబడిన ఆ యువకుడిని స్తంభానికి కట్టి వాకబు చేశారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం ఇచ్చి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా వీరు పలాస- కాశీబుగ్గ పట్టణంలో ఉంటూ ఎవరూ లేని సమయంలో పొలాల్లో ఉన్న మేక పోతులను తస్కరించి జల్సాలు చేస్తూ బతుకుతున్నట్లు పోలీసులు విచారణలో తెలిసింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గాయపడిన యువకుడి మృతి

టెక్కలి: కె.కొత్తూరు హైవేపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అరసవెల్లి శంకరరావు(30) శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈయన ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డుపై వెళ్తున్న పిచ్చివాడ్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీ కొన్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిది కోటబొమ్మాళి మండలం కొత్తపేటగా సమాచారం.

### ఆవును ఢీకొన్న రైలు

టెక్కలి: టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్ సమీపంలో గుణుపూర్-రేగ్యాలా వెళ్లే రాజు-రాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం సాయంత్రం పట్టాలు దాటుతున్న ఓ ఆవును ఢీకొంది. దీంతో రైలు నిలిపి వేయడంతో టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్‌లో గేటు వద్ద కొంతసేపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. సిబ్బంది ట్రాక్‌పై పడివున్న ఆవును తొలగించి రైలును పంపించారు.

### శతాధిక వృద్ధురాలి మృతి


కాములమ్మ (ఫైల్)

వజ్రపుకొత్తూరు: బాతుపురం పంచాయతీ పెదవంక గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు చెల్లూరు కాములమ్మ, అలియాస్ కామాక్షమ్మ (105) శుక్రవారం రాత్రి మృతి చెందింది. భర్త కృష్ణమూర్తి సుమారు 40 ఏళ్ల క్రితమే మృతి చెందినట్లు సర్పంచ్ బత్తిని సృజన తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా ఇప్పటికే ఒక కుమారుడు, కుమార్తె కూడా మృతి చెందారు. ఈమెకు మనుమలు, ముని మనుమలు కలిపి 15 మంది ఉన్నట్టు గ్రామస్థులు పేర్కొన్నారు. 105 ఏళ్ల వయసులోనూ ఎంతో చురుకుగా ఉండే దన్నారు. కాములమ్మ మృతితో పెదవంక, బాతు పురం గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

### 24న వాహనాల వేలం

అరసవల్లి: వివిధ తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 24న మధ్యాహ్నం 3.00 గంటలకు జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు జిల్లా రవాణాశాఖ ఉప రవాణా కమిషనర్ ఎ.చంద్రశేఖర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలానికి ఒక రోజు ముందుగా సదరు వాహన యజమానులు, ఫైనాన్షియర్లు చెల్లించాల్సిన మొత్తం చెల్లించి వారి వాహనాలను తీసుకుపోవచ్చని, లేకుంటే ఎటువంటి తాఖీదులు లేకుండా వాహనాలను వేలం వేస్తామన్నారు. ఈ వాహనాలను శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆర్టీసీ డిపోల్లో, ఆమదాలవలస, పొందూరు, కొత్తూరు, జలుమూరు, మందస, ఇచ్ఛాపురం టౌన్ పోలీసు స్టేషన్లలో ఉంచామన్నారు. వేలంలో పాల్గొనేవారు తమ ఆర్సీసీ, జీఎస్టీ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలలోగా తమ కార్యాలయంలో రూ.10,000 ధరావత్తు చెల్లించి, 24న వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో వాహనాన్ని దక్కించుకునేవారు మిగిలిన మొత్తం ఐదు దినాల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## గిరిజనుల భూములను పరిరక్షించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న యోగి

జలుమూరు: గిరిజనుల భూములను పరిరక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సీహెచ్ నాగమ్మకు శనివారం వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా గిరిజనుల హక్కులో ఉన్న వ్యవసాయ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్న వారిపై తగు చర్యలు తీసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాకివలసకి చెందిన పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

## అవగాహనతో జునోసిస్ వ్యాధుల నియంత్రణ

- సెంచ్యూరియన్ యూనివర్సిటీ వైస్‌ప్రెసిడెంట్, ప్రొఫెసర్ డీఎన్‌రావు

ఒడిశా


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్‌రావు

పర్లాకిమిడి: జునోసిస్ వ్యాధులను నియంత్రించేందుకు అవగాహన అవసరమని సెంచ్యూరియన్ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. పర్లాకిమిడి సెంచ్యూరియన్ యూనివర్శిటీలో శనివారం జునోసిస్ దినోత్సవాన్ని స్కూల్ ఆఫ్ వెటర్నరీ, యానిమల్ సైన్స్ వెటర్నరీ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జంతువులు, పెంపుడు జీవాలకు కచ్చితంగా టీకాలు అందించాలన్నారు. యూనివర్శిటీ అధ్యాపకులు సోహన్ రచించిన 'గొర్రెలు, మేకల వైద్యం-సహ సంరక్షక సేవలు' అనే పుస్తకాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అనితపాత్రో ఆవిష్కరించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పెంపుడు కుక్కల సంరక్షణపై అవగాహన పెంపొందించేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్‌సీ నందా, ఆర్కే స్వాయి, ఐకార్-సీఐఎఫ్ఏ శాస్త్రవేత్త ప్రియంబ్రత తదితరులు పాల్గొన్నారు.

## గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దండి

- హౌసింగ్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే బగ్గు


హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి: వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో హౌసింగ్ విభాగంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది అర్హులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం కత్తెరవానిపేటలోని క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎంఏవై పథకంలో కొందరు వైసీపీ నాయకులు అర్హత లేకుండా స్థలాలు, ఇళ్లు పొందారని అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. జమ్ము పంచాయతీలో వేసిన పది లేవుట్లలో 40 శాతం మేరకు అనర్హులకు పట్టాలిచ్చారని, వాటిని లబ్ధిదారులు విక్రయించారని, దీనిపై సమగ్రంగా నివేదిక అందించాలన్నారు. జమ్ములో వేసిన పది లే అవుట్లలో లబ్ధిదారులు, లే అవుట్ల మ్యాపింగ్ తదితర వివరాలను అందజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ నగేష్, డీఈ అప్పారావు, ఏఈలు శంకరరావు, ప్రసాద్, సిబ్బంది చిన్నారావు, అప్పారావు, రమణమూర్తి, టీడీపీ నాయకులు బైరి భాస్కరరావు, కాయ రవి తదితరులు పాల్గొన్నారు.

## పని ఒక చోట.. ఫొటో మరో చోట

- 'ఉపాధి' పనులపై రైతుల అభ్యంతరం


గుచ్చెరి బట్టి వద్ద ఫొటో తీసుకునేందుకు వచ్చిన వేతనదారులను అడ్డుకుంటున్న స్థానిక రైతులు

మెళియాపుట్టి, జూలై 7: గ్రామాల్లోనే ఉపాధి పనుల కల్పన ద్వారా వలసల నివారణకు ప్రభుత్వాలు ఉపాధి పనులు చేపడుతున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్వాకంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాగునీటి వనరుల అభివృద్ధికి గాను కాలువల్లో పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. అయితే ఇక్కడి సిబ్బంది మాత్రం పని ఒక చోట.. ఫొటో మరో దగ్గర తీసుకునేందుకు వేతనదారులను పంపడంతో స్థానిక రైతులు అభ్యంతరం వ్యక్తంచేసిన ఘటన శనివారం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి.. శనివారం చాపర గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులు గోపీనాథపురం బట్టిపనులు చేసి.. ఫొటో మాత్రం గుచ్చిరి బట్టి వద్ద తీయడంతో అక్కడి రైతులు అభ్యంతరం తెలిపారు. ఇక్కడ ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించగా ఇక్కడ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని సిబ్బంది చెప్పారని పేర్కొనగా వారు అవాక్కయ్యారు. ఇక్కడ మస్తర్లు వేస్తుండడంతో రైతులకు ఉపయోగం లేదని వారంటున్నారు. రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే పరిస్థితి లేదని చాపర టీడీపీ నాయకులు మజ్జి పోలి నాయుడు, దారపు దామోదరరావు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఉపయోగమైన పనులు చేయాలని కోరుతున్నారు.

## నిత్యావసరాల ధరలు అందుబాటులో ఉండాలి

- జాయింట్ కలెక్టర్ నవీన్


మాట్లాడుతున్న జేసీ నవీన్

కలెక్టరేట్: నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హోల్‌సేల్ డీలర్లకు సూచించారు. బియ్యం, పప్పులు, ఆయిల్, పంచదార ధరల నియంత్రణపై శనివారం కలెక్టరేట్‌లో డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లు, వినియోగదారులు నష్టపోకుండా ధరల తగ్గింపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని వారిని అడిగారు. ప్రభుత్వ పోర్టల్‌లో ప్రతీ డీలర్ పేరు నమోదై ఉండాలని, సరుకులు ఉండి లేవని చెబితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కందిపప్పు ధర తగ్గించి ప్రభుత్వం తరఫున విక్రయించేందుకు జిల్లాలో షాపులు గుర్తిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి శాంతిశ్రీ, జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, మార్కెటింగ్ ఏడీ నాగలక్ష్మి జ్యోతి, జిల్లాలోని హోల్‌సేల్ డీలర్లు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు

అరసవల్లి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. పైడి భీమవరంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలని, కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ బేవరేజస్, రెడ్డీస్, అరబిందో, శ్యామ్‌క్రగ్ పిస్టన్స్, నీలం జూట్ పరిశ్రమల కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రిమ్స్ కార్మికుల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న అఖిలభారత కోర్కెల దినం సందర్భంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.సూరయ్య, ఎన్‌వీ రమణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, జి.అమరావతి, బి.ఉత్తర, ఆర్.ప్రకాష్, పి.లతాదేవి, ఎన్. బలరాం, కె.చంద్రశేఖర్, రాజు, సూరిబాబు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### నవ్వించిన 'దొందూ దొందే'

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం బాపూజీ కళామందిర్‌లో నెలవారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపట్నంకు చెందిన భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, దర్శకుడు ఎస్.డేవిడ్ రాజు ఆధ్వర్యంలో 'దొందూ దొందే' నాటిక ప్రదర్శించగా కడుపుబ్బా నవ్వించింది. పేద కళాకారులకు పింఛన్ అందచేశారు. కార్యక్రమంలో చిట్టి వెంకటరావు, కిలారి ఈశ్వరరావు, కూన రాజారావు, ముంగి శ్రీనివాసరావు, రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, పి.వెంకటరావు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ


టెక్కలి: తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

టెక్కలి/నరసన్నపేట: టెక్కలి, నరసన్నపేట లోని పలు ఎరువుల దుకాణాలను శనివారం విజిలెన్స్ వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేపట్టారు. తాడేపల్లిగూడెం వ్యవసాయశాఖ ఏడీ పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్ కుమార్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎల్.మురళీధర్, ఏడీ రవీంద్రభారతి, ఏవోలు జి.రంగారావు, సునీతలతో కూడిన బృందాలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. గొడౌన్లలో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, పురుగు మందుల విక్రయాలను పరిశీలించారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లులివ్వాలని, బిల్లుపై రైతు సంతకం తీసుకోవాలని ఏడీఏ మురళీకృష్ణ అన్నారు. ఎమ్మార్పీ రేట్లకు మించి ఎరువులు అమ్మవాదని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ

**శ్రీకాకుళం క్రైం:** సైబర్ నేరగాళ్లు చేసే నకిలీ కొరియరు ఫ్యాడ్స్ పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాధిక కోరారు. ఈ తరహా నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరుతూ ఎస్పీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంగా సైబర్ నేరగాళ్లు కాల్ చేసి తాను పోలీసు అధికారిగా, సీబీఐ అధికారిగా, కస్టమ్స్ అధికారిగా పరిచయం చేసుకుని మీ పేరు మీద కొరియర్ వచ్చిందని అందులో అక్రమ ఆయుధాలు, మాదకద్రవ్యాలు ఉన్నాయని దానికి కారణంగా మీ మీద ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశామని చెప్పి మిమ్మల్ని స్కైప్ ద్వారా వీడియో కాల్ కాన్‌కాస్ట్ అవ్వమని చెప్తారన్నారు. కనెక్ట్ అయిన తర్వాత సైబర్ నేరగాళ్లు పోలీస్ యూనిఫాంలోనే ఉంటూ మీ మీద కేసు లేకుండా చెయ్యాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తూ కనీసం మిమ్మల్ని వేరే వాళ్లతో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరన్నారు. ప్రస్తుత రోజుల్లో ఈ రకమైన నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ఎవరూ ఏ విధమైన కాల్స్‌కి స్పందించ వద్దన్నారు. ఈ విషయంలో అనుమానాస్పదంగా అనిపించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మీ వ్యక్తిగత సమాచారం కోసం పోలీసులు ఎప్పుడు ఫోన్స్ చేయరని స్పష్టం చేశారు. ఒకవేల మీరు సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌కు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

## జన విజ్ఞాన వేదికలో చేరండి



**ఆమదాలవలస:** జన విజ్ఞానవేదికలో చేరి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దన్‌రావు అన్నారు. జన విజ్ఞాన వేదిక సభ్యత్వ ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవుడు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధిస్తూ అంతరిక్షంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్న నేటి తరుణంలో కొంతమంది మూఢ నమ్మకాలతో తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో బోలో బాబా పాదధూళి కోసం జరిగిన తొక్కిసలాటలో 121 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. మూఢ నమ్మకాలను స్వస్తి పలికి శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బొడ్డేపల్లి రామకృష్ణ, జేవీవీ నాయకులు హెచ్‌వీ సత్యనారాయణ, కె.షన్ముఖరావు, బెండి సూర్యనారాయణ, మెండ శ్యామలరావు, చింతాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో మేలు

**ఆమదాలవలస:** రైతులు తమ పొలల్లో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు పురాతన పద్ధతిలో పశువుల పేడ, కుళ్లిన పెంట గత్తంతో వర్మీకంపోస్టు ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎఫ్‌పీవో సీసీ రామప్పడుతో పాటు మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పీపీలు, ఏపీపీలు, పోలీసులు

**గుజరాతీపేట:** నూతన చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు శాఖ అవగాహన పెంచుకుని న్యాయవ్యవస్థకు తోడ్పడాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ భైరి రామకోటేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, పోలీసు అధికారులతో విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పీపీలు, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాల అమలులోకి వచ్చాయన్నారు. వీటిపై అవగాహన చేసుకుని బాధితులకు, కక్షిదారులకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మెట్ట మల్లేశ్వరరావు, వాన కృష్ణచంద్, టి.శివ ప్రసాదరావు, సీహెచ్ శ్రీకాంత్, కె.తిరుమలరావు, కె.శంకరరావు, ఎల్‌వీ రమణ, సీహెచ్ సత్యనారాయణ, కె.ఉషారాణి, ఉషాకిరణ్, ఏపీపీలు కె.సూర్యకుమార్, ఎల్.నాగభూషణం, పి.సుశీల, జి.ప్రియదర్శిని, ఆర్.శాంతి, సంతోషి, వి.విజయలక్ష్మి, డి.హరి ప్రియ, ఎల్.రఘునాథ్ పాల్గొన్నారు.

## వారాహి నవరాత్రులు ప్రారంభం



కుంకుమ పూజలల్లో పాల్గొన్న భక్తులు

**శ్రీకాకుళం కల్చరల్:** బలగలోని స్వర్ణాకర్షణ భైరవ ఆలయంలో వారాహి గుప్తా నవరాత్రులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలత్రిపుర కాలభైరవ పీఠంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. చిత్తరంజన్ వీధిలోని రాజరాజేశ్వరి పీఠంలో అర్చకుడు నుసరాపు లక్ష్మీగణపతి ఆధ్వర్యంలో, గుజరాతీపేటలోని లలితా పీఠంలో అర్చకుడు పెంటా రామచంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు.

## మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

**ఎచ్చెర్ల:** దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో మిగులు సీట్ల భర్తీకి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థులు సోమవారం ఉదయం 10 గంటలకు గురుకుల పాఠశాలకు నేరుగా హాజరుకావాలని కోరారు.

## శ్రీకాకుళం-ఆమదాలవలస

- బాండ్ల రూపంలో బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తాం
- అధికారులతో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సమీక్ష

# రోడ్డు విస్తరణకు కొత్త మాస్టర్ ప్లాన్



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

**అరసవల్లి:** శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డు విస్తరణకు కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం స్థానిక అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో సుడా, నగర కార్పొరేషన్, ఆర్‌అండ్ బీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 20 ఏళ్ల కిందట రూపొందించిన ప్లాన్ ప్రకారం నేటికీ పనులు జరుగుతున్నాయని, ఇన్నేళ్లలో నగరం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. దీంతో నేటి అవసరాలకు అప్పటి మాస్టర్ ప్లాన్ సరిపోదన్నారు. అందుకే నేటి అవసరాలకు తగ్గట్లుగా మార్పులు, చేర్పులు చేసి కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తామని, వారితో రెండు రోజుల్లో సమావేశం నిర్వహించి, బాండ్ల రూపంలో నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ.. నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి పంపించనున్నట్టు తెలిపారు. వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సుడా, నగరపాలక సంస్థ, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

## జగన్‌రెడ్డి.. సానుభూతి ప్రేలాపనలు మానుకో

- ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

**సరుబుజ్జిలి:** రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి కోలుకోలేని దెబ్బ కొట్టారని, దీంతో మతిపోయిన జగన్‌రెడ్డి మళ్లీ సానుభూతి ప్రేలాపనలు అందుకున్నాడని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మూలసవలాపురంలో పర్యటించిన రవికుమార్ విలేకరులతో మాట్లాడారు. అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ సీఎం జగన్‌రెడ్డిని గౌరవించినా విలువలు కోల్పోయి సైకోలా వింత ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. తండ్రి, బాబాయ్ మరణలతో సానుభూతి నాటకం ఆడి 2019లో అధికార చేపట్టి రాష్ట్రాని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి వింత ప్రేలాపనలతో కేసులు పెట్టించుకొని ప్రజల సానుభూతి పొందాలనే ఆలోచనలో ఉన్నాడని విమర్శించారు. దేశంలో అధికారం చేపట్టిన 20 రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి తన తీరు మార్చుకోకుంటే వైసీపీ అడ్రాస్ లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు, టీడీపీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు, గురువు తిరుమలరావు, టి.సురేంద్ర, ఎం.అప్పలనాయుడు, జె.పాపారావు, జి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

**ఎచ్చెర్ల:** అంబేడ్కర్ యూనివర్సిటీలో శనివారం దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి వర్సిటీ అధికారులు నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, ప్రిన్సిపాళ్లు ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, డీన్ ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీని పరామర్శించిన ఎన్ఈఆర్

**జి.సిగడాం:** మెట్టవలస ఎంపీటీసీ జెవర జగన్నాథరావు తండ్రి చిన్నంనాయుడు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) శనివారం జగన్నాథరావును పరామర్శించి తండ్రి మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ కామోజుల అరుద్ర, కూటమి నాయకులు కామోజుల సీతారాం, టంకాల మౌళీశ్వరరావు, పైల రామకృష్ణంనాయుడు, కంచరాన సూరన్నాయుడు, జె.ప్రసాద్, ఎస్.గోవింరావు, ఎం.కన్నంనాయుడు, ఎస్.గోపాలనాయుడు ఉన్నారు.



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**సరుబుజ్జిలి:** ప్రతి మహిళ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఏపీఎం పి.కమలకుమారి అధ్యక్షతన జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలను వినియోగించుకోవాలన్నారు. గ్రామ సంఘాల సమావేశాలు విధిగా షెడ్యూల్ ప్రకారం జరగాలన్నారు. అనంతరం విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంలు బి.నారాయణరావు, ఐబీకే మోహన్‌రావు, ఎల్‌సీ రామచంద్రరావు, స్త్రీనిధి మేనేజర్ లక్ష్మణరావు, అధ్యక్షురాలు బి.చామంతి, సీసీలు, సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

## హిజ్రాలకు గుర్తింపు ధ్రువపత్రాలు

**కలెక్టరేట్:** జిల్లాలో గల హిజ్రాలకు అవసరమైన సహాయాన్ని పొందేందుకు వారికి గుర్తింపు ధ్రువ పత్రాలను జారీ చేస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు శాఖ ఏడీ కె.కవిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఆర్థిక సాయం పొందాలనుకునే హిజ్రాలకు ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. పింఛన్, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇతర ప్రయోజనాలను, వివిధ ప్రభుత్వ శాఖలు అందించేలా పొందడానికి ఈ కార్డు అవసరమని తెలిపారు. ఇప్పటివరకు ధ్రువపత్రాలు పొందని హిజ్రాలు నోటరీ అఫిడవిట్ చేయించుకుని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు శ్రీకాకుళంలోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## యోగాతో ఆరోగ్యం

**శ్రీకాకుళం కల్చరల్:** నిత్యం యోగం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో సభ్యుడిగా ఉండటం అదృష్టమన్నారు. ధ్యానం, మెడిటేషన్‌తో రుగ్మతలు దూరమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అమ్మన్నాయుడు, కేఎస్ఎన్ మూర్తి, లాయర్ సుధారాణి, రేణుక, గోవింద్, సందీప్, శంకర్ నారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువల మరమ్మతులకు నిధులు

**అరసవల్లి:** నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు, కాలువల మరమ్మతులకు ప్రభుత్వం రూ.80లక్షలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో శివారు భూములకు సైతం ఖరీఫ్‌లో నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పలు ఎత్తిపోతల పథ కాలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, అదే విధంగా పలుచోట్ల కాలువలు బాగు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి రూ.80లక్షలు మంజూరు చేశారన్నారు. అలాగే శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీలోని గాయత్రి ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ద్వారా టైలరింగ్, ఫ్యాషన్ గార్మెంట్స్ తయారీలో శిక్షణ పొందిన మహిళలకు ఎమ్మెల్యే గొండు శంకర్ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు శవ్వాన ఉమామహేశ్వరితోపాటు విభూది సూరిబాబు, శవ్వాన వేంకటేశ్వరావు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## 9న మెగా ఉద్యోగమేళా

**టెక్కలి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న జేకేసీ కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ, హైదరాబాద్‌లకు చెందిన అరబిందో, ఎమ్మెన్సీ ల్యాబ్‌లో ఉద్యోగాల కోసం ఈ ఎంపికలు చేస్తారన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్నవారు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 7013365031 నెంబరును సంప్రదించాలన్నారు.

# ఈ ఏడాదీ కన్నీరేనా!

- అరకొరగానే వర్షాలు
- వేసవిని తలపిస్తున్న ఎండలు
- గతేడాది పరిస్థితులే పునరావృతం
- ఆందోళనలో రైతులు



వర్షాలు లేక దుక్కులకు నోచుకోని పొలాలు

**కంచిలి, జూలై 6:** గతేడాది ఖరీఫ్‌లో నెలకొన్న పరిస్థితులే ఈ ఏడాది కూడా పునరావృతమవుతున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సీజన్ మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షాలు కురవడంతోపాటు జూలై మొదటి వారం ప్రారంభమైనా పెద్దగా వర్షాల జాడ లేకపోవడంతో రైతులు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. ఇదే సమయంలో వేసవిని తలపించేలా ఎండతో పాటు వాతావరణంలో ఉక్కపోత కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు నారుమడులు పోసే విషయంలో ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు. రిజర్వాయర్ల పరిధిలోనూ చెరువుల కింద సాగయ్యే భూముల్లో విత్తనాలు చల్లినా, మిగిలిన ప్రాంతాల్లో ఇంకా నారుమడులు వేయలేదు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవలేదు. దీంతో నారుమడులు వేసినా నాట్లు వేయలేక కొంతమంది, ఉభాలు వేసినా నీరందక కొన్ని ప్రాంతాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయాయి. ఏటా జూలై రెండో వారానికే చాలాచోట్ల వరినాట్లు ప్రారంభమై ఆగస్టు నెలాఖరునాటికి 80 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉండగా, గతేడాది కంచిలి మండల పరిధిలో 11వేల ఎకరాలకు గాను సుమారు 3700 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.



పొలాల్లో ఎదసాగు చేస్తున్న దృశ్యం

**ఇప్పుడూ అదే పరిస్థితి..**

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సైతం గత ఏడాది పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. వాస్తవానికి జూన్ నెలాఖరు నుంచే చాలాచోట్ల వరి నారుమడులు తయారు చేసి విత్తనాలు చల్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. చెరువుల పరిధిలో కొంత ముందుగానే విత్తనాలు చల్లుతారు. కానీ ఈ ఏడాది జూన్‌లో వర్షాల జాడలేకపోగా ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో విత్తనాలు చల్లే పని ప్రారంభం కాలేదు. మరి కొన్నిప్రాంతాల్లో నారుమడులను సిద్ధం చేసినా వర్షాలు సరిగ్గా కురవకపోతే ఏమిటన్న భయం రైతులను వెంటాడుతోంది. మరి కొంత మంది రైతులు గత ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరిలో ఎదసాగు విధానంలో విత్తనాలు వేస్తున్నారు. అయితే ఎద సాగు విధానంపై స్థానిక రైతులకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవడం, ఎద సాగు వల్ల పంట దిగుబడి తగ్గుతుందన్న భావన ఉండడం వల్ల ఈ సాగుపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది కూడా సాధారణ వర్షపాతాలే నమోదయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

**ఎదసాగుపై దృష్టి సారించాలి..**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదసాగుపై దృష్టి సారిస్తే ప్రయోజనం ఉంటుంది. ఎద సాగు వల్ల రైతులకు ఖర్చులు తగ్గడంతోపాటు, పంటను కాపాడుకోవచ్చు. చెదురు మదురు జల్లులు కురిసినా ఎదసాగుకు ఉపయోగకరంగా ఉంటుంది. మండలంలో 11,600 ఎకరాల పంట భూమి ఉండగా ఇప్పటి వరకు 2,500 ఎకరాలకు నారు మడులు సిద్ధం చేసుకోగా, 110 ఎకరాల్లో ఎదసాగు చేస్తున్నారు. మిగిలిన రైతులు సైతం ఎదసాగు చేసేందుకు ముందుకు రావాలి.

-ధనుంజయ, వ్యవసాయాధికారి, కంచిలి

## గ్రామ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్థులు

**సోంపేట:** రామయ్యపట్నం గ్రామంలో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను ఆయన స్వగృహంలో శనివారం ఆ గ్రామస్థులు కలిసి వినతి పత్రం అందించారు. టెక్నికల్ సమస్యలు కారణంగా నిలిచిపోయిన గొల్లగండి నుంచి రామయ్యపట్నం వరకు తారురోడ్డు పూర్తిచేయాలని కోరారు. అదేవిధంగా గ్రామానికి కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నిట్ట గోపాల్, మద్దు రాజారావు, కోదండరావు తదితరులు ఉన్నారు.

## మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు



మంత్రిని సత్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

**ఇచ్ఛాపురం:** జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను తీసుకెళ్లినట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి సాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. సమస్యలన్నీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చినట్టు రాజు తెలిపారు.

## వ్యాధులు సోకకుండా చర్యలు

**ఎల్ఎన్ పేట:** గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జి.గిరిబాల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజ నీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టిన పారి శుధ్య పనులపై ఆరా తీశారు. కాలువలను శుభ్రం చేయాలని, రోడ్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. దోమలను నివారించే మందును పిచికారీ చేయా లన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమా వేశంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బందికి సన్మానిస్తున్న కూటమి నాయకులు

**కంచిలి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీలో తలతంపర సచివాలయ సిబ్బంది ఒక్కరోజులోనే 99శాతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందిని శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాదిన రామారావు, బంగారు కురయ్య, మర్రిపాటి పూర్ణ, జగబందు దొళాయి, అభిమన్యు, నీలాంబర్, ఫణీంద్ర, వేణు, దుర్గాశ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ఇచ్ఛాపురం:** స్థానిక రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం ఆర్జే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రోటరీ అధ్యక్షుడిగా ఎం.రాజ్‌కుమార్, సెక్రటరీగా పైడిశెట్టి దినేష్‌కుమార్, ట్రెజరర్‌గా నీవన్‌కుమార్, ఉపాధ్యక్షులు కె.వేదవ్యాస్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా ఎస్‌సీ రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి క్లబ్ సభ్యులు పూలగుచ్ఛం అందించి అభినందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, పూర్వపు డిస్ట్రిట్ గవర్నర్ విశ్వనాథ్, అసిస్టెంట్ గవర్నర్ వి.రాజనీకాంత్, జేసీఐ క్లబ్ పూర్వపు నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణం

**ఇచ్ఛాపురం:** స్థానిక రోటరీ క్లబ్ సభ్యులు విరాళాలు వేసుకుని ఏఎస్ పేట గ్రామంలో రూ.3లక్షల వ్యయంతో బస్ షెల్టర్‌ను నిర్మించారు. బస్ షెల్టర్‌ను శనివారం రోటరీ పూర్వపు గవర్నర్ విశ్వనాథం చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాటసారులకు, స్థానికుల అవసరం కోసం దీనిని నిర్మించడం మంచి పరిణామమన్నారు. అలాగే ఇచ్ఛాపురం పట్టణ పరిధిలోగల ప్రధాన జంక్షన్ల వద్ద రోటరీ క్లబ్ సభ్యులు సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. దాసన్నపేట జంక్షన్, గవర్నమెంట్ ఆసుపత్రి రోడ్డు జంక్షన్ వద్ద సైన్ బోర్డులు పెటించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు దినేష్‌కుమార్, పాక తులసీదాస్, నవీన్‌కుమార్, సురేష్, దక్షత కృష్ణమూర్తిరెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ వేదవ్యాస్, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం నిర్వహణపై విచారణ

**టెక్కలి:** స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వహణపై వచ్చిన ఫిర్యాదుల మేరకు శనివారం మండల విద్యాశాఖాధికారులు విచారణ చేప ట్టారు. నాణ్యమైన భోజనం పెట్టాలని మండల విద్యాశాఖ అధికారులు తులసీరావు, చిన్నారావు హెచ్‌ఎంకు సూచించారు. వీరితో పాటు స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లింగరాజు పాల్గొన్నారు.

## 9న మెగా ఉద్యోగమేళా

**టెక్కలి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న జేకేసీ కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ, హైదరాబాద్‌లకు చెందిన ఫార్మా కంపెనీలైన అరబిందో, ఎమ్మెస్సీ ల్యాబ్‌లో ఉద్యో గాల కోసం ఆయా కంపెనీల ప్రతి నిధులు ఈ ఎంపికలు చేస్తారన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్నవారు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఇతరవివరాలకు 7013365031 నెంబరులో సంప్రదించాలన్నారు.

## వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

**నందిగాం:** పెంటూరు వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢంతో పాటు జగన్నాథ రథయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రవిరామాచార్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

## విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

**హిరమండలం:** హిరమండలంలోని నౌగూడ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సదు పాయం కల్పించేందుకు కృషి చేస్తానని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు తెలిపారు. శనివారం అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యుత్ సమస్యపై ఇప్పటికే సంబంధిత అధికారులకు తెలిపానన్నారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డి.తేజ, ఎం.మిన్నారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 20 టన్నుల యూరియా ఏమైనట్టు?

- ఎమ్మెల్యే బెందాళం అశోక్
- కంచిలి వ్యవసాయాధికారులతో సమీక్ష

**కవిటి:** వైసీపీ ప్రభుత్వ హయాంలో గతేడాది 20 టన్నులు యూరియా పక్కదారిపట్టినట్టు వ్యవసా యాధికారులు వెల్లడించారు. ఎమ్మెల్యే బి.అశోక్ శనివారం తన స్వగృహంలో వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది జరిగిన ఎరువుల పంపిణీపై నివేదిక ఇ వ్వాలని అధికారులను ఎమ్మెల్యే అశోక్ కోరారు. దీంతో కంచిలి మండల వ్యవసాయాధికారి ధనుం జయ తడబడ్డారు. గతేడాది పీఏసీఎస్ ద్వారా పం పిణీకి సిద్ధం చేసిన 20 టన్నుల యూరియాను తన కు చెప్పకుండానే దారి మళ్లించారని చెప్పారు. ఎవ రు తీసుకెళ్లా? ఇంతవరకు ఎందుకు చర్యలు తీసు కోలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీనితో ఏడీఏ జగన్మోహనరావు కల్పించుకొని రికవరీకి నోటీసు పంపించామని, శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. దీనిపై పలుమార్లు కంచిలి పీఏసీఎస్ సీఈవోను వివరణ కోరితే.. ఆన్‌లైన్ చేయలేదనే సమాధానం ఇస్తున్నారని కంచిలి వ్యవసాయాధికారి ధనుంజయ చెప్పారు. ఏడాది కాలంగా ఇంత నిర్లక్ష్యంగా ఎలా వ్యవహరిస్తున్నారని అధి కారులపై అశోక్ ఆ గ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విజి లెన్సు విచారణకు నివే దిస్తానని ఎమ్మెల్యే అశో క్ అన్నారు. గత ఐదేళ్లలో రైతులకు అందిం చిన సేవలపై నివేదిక ఇవ్వాలని కోరారు.

**రైతులకు సేవ చేయండి**

ఇచ్ఛాపురం నియోజకవర్గం పూర్తిగా వ్యవసా యంపై ఆశిరపడిన వారే అధికంగా ఉన్నారని వారికి సేవ చేయాలని ఎమ్మెల్యే అశోక్ సంబంధిత అధికారులకు సూచించారు. విత్తనాలు, ఎరువులు రైతులందరికీ అందేలా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పంటల నమోదులో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఇకపై అలా జరిగితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. అడవి పందులు బెడద అధికంగా ఉందని వాటి నివారణకు కంచే వేసే చర్యలు చేపట్టాలని సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

## పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

**పాతపట్నం:** ప్రాణాంతకమైన జునోసిస్ వ్యాధులపై యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో ప్రపంచ జునోసిస్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెంపుడు జంతువుల ద్వారా సోకే ర్యాబిస్, ఆంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ తదితర ప్రాణాంతకమైన వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పశు సంవర్ధక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు మాట్లాడుతూ.. అన్ని పశు వైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. అలాగే ఆదివారం నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీదిచ కొరసవాడ, పెద్దలోగిడి పశు వైద్యాధి కారులు బి.శ్రీవాణి, పి.అనిల్, కె.మౌనిక, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, పశు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు టీకాలు

**కంచిలి:** జూనోసిస్ డే సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు వేశారు. మండలంలో గల పశువైద్యశాలలో 11 కుక్కలు వ్యాక్సినేషన్ చేపట్టినట్టు పశువైద్యాకారిణి టి.శిరీష తెలిపారు.



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

## వల్లభరాయుడుపేటకు బస్సు పునరుద్ధరణ

**నందిగాం:** వల్లభరాయుడుపేటకు బస్సు సర్వీసున శనివారం పునరుద్ధరించారు. ఈ బస్సు సర్వీసును ఐదేళ్ల కిందట నిలిపి వేయడంతో ఈ ప్రాంతీయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను ఎన్నికల సమయంలో తెలుగుయువత అధికార ప్రతినిధి గున్న ప్రవీణ్, ఎస్.కృష్ణారావు తదితరులు కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించి సమస్యను పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి టెక్కలి నుంచి వల్లభరాయుడుపేటకు వచ్చిన బస్సు సర్వీసును టీడీపీ నాయకులు పి.అజ య్‌కుమార్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, జి.మన్మథరావు ప్రారంభించారు. పునఃప్రారంభిం చారు. ఈ సర్వీసు వల్ల దొడ్లరామచంద్రాపురం, దేవాడ, భరణిగాం, వల్లభ రాయుడుపేట, కొండ పేట, నరేంద్రపురం తదితర గ్రామాలకు ఉపయోగకరమని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీ బలోపేతానికి మరింత కృషిచేయాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు దుర్యోధనరావు

**హరిపురం:** గ్రామస్థాయిలో టీడీపీ మరింత బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధనరావు అన్నారు. హరిపురంలో శనివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ల్లో ఐదింటికి ఒకేసారి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి చేనుకు నీరు, ప్రతి చేయికి పని హామీతో గెలిచిన ఎమ్మెల్యే శిరీష వంశధారను పలాస వరకు తీసుకు వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జీకే నాయుడు, కొర్ల కన్నా రావు, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య, నవీన్, తమిరి భాస్కరరావు, ముంజేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

**ఎల్ఎన్ పేట:** పంటలు సాగు చేసే రైతులు రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడకూడదని ఏవో పి.లతాశ్రీ అన్నారు. పెద్దకొల్లివలస రైతు భరోసా కేంద్రంలో శనివారం డీఏపీ, యూరియాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక మోతాదులో ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. భూసార పరీక్షలు చేసిన ధ్రువ పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.రాజే శ్వరి, ఆర్ఐ ఎస్.గవరయ్య, జి.రాము, జి.గణేశ్‌కుమార్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## యూనిఫారాలు అందజేత

**కవిటి:** స్థానిక ప్రభుత్వ జూనియరు కళాశాలలో ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థులకు యూనిఫారాలను కవిటికి చెందిన ఉషోదయ యువజన సంఘం ప్రతినిధులు శనివారం అందజేశారు. 50 మంది విద్యార్థులకు సమకూర్చారు. ఈమేరకు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వాటిని అందజేశారు. సంఘ అధ్యక్షుడు పి.శేఖర్, మాజీ జడ్పీటీసీ బి.రమేష్, సభ్యులు ఎ.మధు, ఎ.రాజు, బి.రవి, బి.విశ్వనాథం, జె.లోకనాథం, పి.చిన్నారావు, వెంకటరావు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ

**శ్రీకాకుళం క్రైం:** సైబర్ నేరగాళ్లు చేసే నకిలీ కొరియరు ప్యాక్స్ పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాధిక కోరారు. ఈ తరహా నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరుతూ ఎస్పీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంగా సైబర్ నేరగాళ్లు కాల్ చేసి తాను పోలీసు అధికారిగా, సీబీఐ అధికారిగా, కస్టమ్స్ అధికారిగా పరిచయం చేసుకుని మీ పేరు మీద కొరియర్ వచ్చిందని అందులో అక్రమ ఆయుధాలు, మాదకద్రవ్యాలు ఉన్నాయని దానికి కారణంగా మీ మీద ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశామని చెప్పి మిమ్మల్ని స్కైప్ ద్వారా వీడియో కాల్ కాన్‌కాస్ట్ అవ్వమని చెప్తారన్నారు. కనెక్ట్ అయిన తర్వాత సైబర్ నేరగాళ్లు పోలీస్ యూనిఫాంలోనే ఉంటూ మీ మీద కేసు లేకుండా చెయ్యాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తూ కనీసం మిమ్మల్ని వేరే వాళ్లతో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరన్నారు. ప్రస్తుత రోజుల్లో ఈ రకమైన నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ఎవరూ పై విధమైన కాల్స్‌కి స్పందించ వద్దన్నారు. ఈ విషయంలో అనుమానాస్పదంగా అనిపించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మీ వ్యక్తిగత సమాచారం కోసం పోలీసులు ఎప్పుడు ఫోన్స్ చేయరని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే 1930కి కాల్ చేయాలని, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌కు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

**టెక్కలి:** పెద్దరోకళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గందాపు శివానంద్‌ను విద్యా శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఎంఈవో డి.తులసీరెడ్డి శనివారం తెలిపారు. ఫిబ్రవరిలో పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన తమ్మినేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు శివానంద్ మధ్య తగాదా జరిగి అప్పట్లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లింది. ఈ వ్యవహారంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును అప్పట్లో సస్పెండ్ చేసి తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా క్రమశిక్షణా చర్యల్లో భాగంగా శివానంద్‌ను సస్పెండ్ చేసినట్టు ఎంఈవో తెలిపారు.

## గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి నేరుగా ప్రవేశాలు

**నందిగాం:** నందిగాం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు సోమవారం నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.దమయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీలకు 41, ఎస్టీలకు రెండు, బీసీ-సీకి పది, ఓసీకి ఒకటి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎస్సీలకు 15, ఓసీలకు ఒక సీటు ఖాళీగా ఉన్నా యన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు హాజరైతే ఐదో తరగతికి లాటరీ పద్ధతిలో, ఇంటర్ కు పదో తరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 6281905023 నెంబరులో సంప్రదించాలన్నారు.

**రాధాకృష్ణాపురంలో..**

**హరిపురం:** రాధాకృష్ణాపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరి 47, ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఎస్సీ 9, ఓసీ కేటగిరి ఒకటి చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు సోమవారం ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

**పాతపట్నంలో...**

**పాతపట్నం:** స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్‌లో మిగులు సీట్ల భర్తీకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన తెలిపారు. 5వ తరగతికి లాటరీ రూపంలో, ఇంటర్మీడియట్‌కు మార్కులు ఆధారంగా, అలాగే మొదటిగా ప్రవేశపరీక్ష రాసిన వారికి ప్రాధాన్యతాక్రమంలో సీట్లు కేటాయిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు సోమవారంలోగా దరఖాస్తులందజే యాలన్నారు. మంగళవారం మిగులు సీట్ల భర్తీ చేపట్టనున్నామన్నారు. ఇతర వివరాలకు 80966 13777 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## గెడ్డలో పడి ఆవు మృతి

**వజ్రపుకొత్తూరు:** అనంతగిరి గ్రామం గొల్లవీధిలో నివాసం ఉంటున్న బదకల ప్రకాశ్‌కు చెందిన పాడి ఆవు శనివారం గెడ్డలో పడి మృతి చెందింది. శనివారం ఉదయం మేతకు వెళ్లిన ఆవు గెడ్డలో నీరు తాగు తున్న సమయంలో జారిపడి మృతిచెందినట్లు బాధిత రైతు ప్రకాష్ తెలిపారు. హెచ్‌ఎఫ్ జాతికి చెందిన ఈ ఆవు రూ.70 వేలు ఖరీదు ఉంటుందన్నారు. ఆవు మృతిపై మండల పశువైద్యాధికారి మెట్ట పాపారావుకు సమాచారం అందించామని చెప్పారు. బీమా అందించి బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రోడ్ల నిర్మాణారికి ప్రాధాన్యం

**కవిటి:** మండల కేంద్రం, కవిటి మేజరు పంచాయతీలో రోడ్లు నిర్మాణానికి ప్రాధాన్యం వస్తున్నట్టు సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు వివరాలను తెలియజేశారు. అందరి సహకారంతో పంచాయతీని అభివృద్ధి బాటలో తీసుకెళ్తామని ఈవో వీరభద్రస్వామి కోరారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బి.రమేష్, మాజీ సర్పంచ్‌లు ఎ.మధు, పి.శేఖర్, ఎంపీటీసీ పి.సీలాచలం, బి.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై దృష్టి సారించాలి

**ఇచ్ఛాపురం:** ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీకి లబ్ధిదారులకు ఇచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. శనివారం మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో మండల మహిళా సమైఖ్యలో మండలంలో గల 35 గ్రామ సంఘ లీడర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.